# చెరువు

కొండబాబు నల్లగా, పొట్టిగా, బలంగా వుంటాడు. పొట్ట ఎత్తుగా వుంటుంది. అతడు అనకాపల్లి నూకాలమ్మ భక్తుడు. ఎర్రటి రాగి కాణీ అంత గుండ్రని బొట్టు నుదుటి మీద నిండుగా కనబడుతూ వుంటుంది. అతడి పిక్కలు రుబ్బురోలు పొత్రాల్లా గుండ్రంగా బలంగా వుంటాయి. గోధుమరంగులో వున్న పొందూరు సిల్కుపంచె-పొందూరు సిల్కు లాల్చీ ఎప్పుడూ వేసుకుంటాడు. కోయంబత్తూరు జరీ అంచు కండువా మాత్రమే ఎప్పుడూ వేసుకుంటాడు. కొండల అగ్రహారం కన్నయ్య కుట్టిన నల్లని చెప్పులు మాత్రమే ఎప్పుడూ వేసుకుంటాడు. అతడి కుడిచెయ్యి అయిదు వేళ్ళకీ పొళ్ళ ఉంగరాలు పెట్టకుంటాడు. ఎడంచేతికి సత్తు కడియం, బంగారు గొలుసు గల వాచీ వుంటాయి. మెళ్ళో ఒంటిపేట బలమైన బరువైన బంగారు గొలుసు వుంటుంది. అతడి జుట్టు చాలా ఒత్తుగా నల్లగా వుంటుంది. నూనె ఎక్కువగా రాసుకోడం వల్ల ఎండలో జుత్త తళతళ మెరుస్తూ వుంటుంది. ముక్కుని మూసేస్తూ, ఒత్తుగా నల్లని మీసం వుంటుంది. అతడు మీసాల కొసలు ఎప్పుడూ తిప్పుతూ వుంటాడు.

అతడు పక పక బిగ్గరగా నవ్వుతూ వుంటాడు. అతడు ఎగురుతున్న కెరటంలా ఎగురుతూ నడుస్తాడు.

అలాంటి కొండబాబు, ఆ రోజు ఉదయం, ఎగురుతున్న కెరటంలా ఎగురుతూ నడుస్తూ, రెండుచేతులూ జోడించి నమస్కారంచేస్తూ, కాళ్ళు మెట్టుమీద పెట్టుకుని అరుగు మీద కూర్చున్న నారాయణబాబుని సమీపించి సమీపించి, కాలిజోళ్ళు విప్పేసి, జోడించిన చేతులు విప్పకుండా, అతడి కాళ్ళ దగ్గర మెట్టుమీద వినయంగా కూర్చున్నాడు.

'కొండబాబూ! బాగున్నావా!' అని నారాయణబాబు అడిగేడు.

'చిత్తం! చిత్తం! మీ దయవల్ల బాగున్నాము!' అని కొండబాబు నిండుగా నవ్వి వినయంగా చెప్పేడు. నారాయణబాబు అందించిన మంచినీళ్ళ గ్లాసు అందుకున్నాడు. గ్లాసు పెదాలకు తగలకుండా ఆరు అంగుళాలు పైకెత్తి మంచినీళ్ళు గడగడ తాగేడు కొండబాబు.

కొండబాబు వుత్సాహంగా కబుర్లు చెబుతున్నాడు గానీ, నారాయణబాబు

మాత్రం నోరిప్పిలేదు. అయితే – కొండబాబు, వచ్చిన పని చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

"నేను మీ సిసువుణ్ని! ఎనిమిదేళ్ళు మీ దగ్గర చదివేను ! మీ దర్శనం కోసం వచ్చేను!'

'సంతోషం !'

'పదీ – పాతికా – వందా – వెయ్యి' – లేదా వేలూ – మీకు అవసరం వుంటే ఇద్దామని వచ్చేను!'

'వేలే ఇద్దావని వచ్చేవు !'

'ఏటి గురువుగారూ! ఏటి అలా అంటున్నారు ?'

'వేలు ఇద్దావని నువు ఎప్పట్నుంచో చూస్తున్నావు !'

'తప్పా ?'

'అవును !'

'డబ్బు చేదా ?!'

'కాదు ! విషం !'

'నేను మీకు ఏ అన్యాయం – ఏ హానీ చెయ్యలేదే !'

'చెయ్యలేవు !'

'ఎవరికైనా చేసానా ?'

'అవును ! చేద్దావని చూస్తున్నావు !!'

'ఎవరికి ?!'

'నా చెరువు నీకు అమ్మేస్తే, ముప్పయిమంది చిన్న రైతులకి అన్యాయం జరుగుతుంది !'

'నన్ను మీరు శత్రువుగా చూస్తున్నారా ?!'

'కాదు ! రేపో – ఎల్లుండో నేను చస్తాను! పోయినవన్నీ ఏనాడో పోయాయి! తిండిలేక – పిల్లలకి కూడా తిండి పెట్టలేకుండా జీవితాన్ని గడిపేసాను ! నాకు మిగిలిందల్లా ఆ చిన్న చెరువే! మెట్ట పంటలేగానీ వరిపండని మన బూవుల్లో వరి

పండించాలని ఆ చెరువు తవ్వించేను ! పెళ్ళాం మెళ్ళో పుస్తులు అమ్మి తవ్వించేను! ఇప్పుడు ముప్పయిమంది చిన్న రైతులు ఆ చెరువు వల్ల బతుకుతున్నారు ! వాళ్ళ జీవితాలు పాడుచేసి, పాపం మూటగట్టుకుని నేను పోదల్చుకోలేదు ! ఆ చెరువు వాళ్ళకోసం నేను ఒదిలేస్తాను !'

ఆ మాటలు విని కొండబాబు దిగ్గున లేచాడు - కాదు కాదు - గాలిలా రివ్వున లేచేడు - కాదు కాదు - కెరటంలా ఉవ్వెత్తున లేచాడు. పక పక నవ్వలేదు. చేతులు జోడించలేదు. నమస్కారం చెప్పలేదు. రంగు రంగులుగా మెరుస్తున్న కళ్ళతో నారాయణబాబు మొహంలోకి కోపంగా చూస్తూ వడి వడిగా వెళ్ళిపోయాడు.

నారాయణబాబు చిరునవ్వు నవ్వుతూ అతడి మొహంలోకి చూసేడు. వెంటనే దిగ్గున లేచాడు. ఆ చెరువు చిన్న రైతుల పేర కాగితాలు రాయించేడు. ఆ కాగితాలు వాళ్ళకి ఇచ్చీమని కొడుకు వెంకటరావుకి ఇచ్చేడు. ఆ తర్వాత రెండు నెలలు మాత్రమే నారాయణబాబు బతికేడు. చిరునవ్వు నవ్వుకుంటూ శాశ్వతంగా కళ్ళు మూసాడు.

★ ★ ★

వెంకట్రావు చిన్న గుమస్తా ఉద్యోగం చేస్తూ, జీవితాన్ని ఈడుస్తున్నాడు. భార్యా, ముగ్గురు పిల్లలతో కారుషెడ్‌లాంటి ఔట్‌హౌస్‌లో అద్దెకు వుంటున్నాడు.

ఆ ఇల్లు రోడ్డుని ఆనుకుని వుంది. ఆ ఇంటి ముందు విశాలమైన రోడ్డు ఉంది. ఆ రోడ్డుకి రెండు వేపులా చల్లని చెట్లు వున్నాయి. ఒక చెట్టు ఆ ఇంటి ముందు వుంది. ఆ చెట్టు చల్లని నీడా, చల్లనిగాలీ అందిస్తూ వెంకట్రావు కుటుంబానికి పెన్నిధిలా వుంది.

ఆ రోజు ఆదివారం.

స్నానం చేసి, గళ్ళ లుంగీపంచె కట్టుకుని, కట్-బనీయను వేసుకుని ఆ చెట్టు కింద నీడలో మడత కుర్చీ వేసుకుని, అతడు విశ్రాంతిగా కూర్చున్నాడు.

పిల్లలు పుస్తకాలు తెచ్చుకుని, మంచంమీద కూర్చున్నారు. చదువుకుంటూ, దారిని పోయే వాహనాల్నీ జనాన్నీ చూస్తున్నారు - కాదు కాదు - దారిని పోయే వాహనాల్నీ జనాన్నీ చూస్తూ చదువుకుంటున్నారు.

తండ్రి మిగిల్చిన గోడ గడియారం తొమ్మిది కొట్టింది.

అంతలో కారొకటి అక్కడకు వచ్చి ఆగింది. ఆ కార్లోంచి ఒక వ్యక్తి దిగేడు. 'ఏరా ! వెంకట్రావ్ ' అని పిలిచేడు. అలా పిలిచి, బిగ్గరగా నవ్వుతూ నిలబడ్డాడు.

'కార్లో నా కోసం వచ్చే వ్యక్తి నా జీవితంలో ఎవడూ లేడు ! ఉండడు! ఉండబోడు ! మరో వెంకట్రావు ఎవరో అయ్యుంటాడు!' అనుకుంటూ, అనుకుంటూ, తొట్రుపాటు పడుతూ, "నేను కాదండీ! నేను కాదండీ!" అని వెంకట్రావు తడబడుతూ చెప్పేడు.

'నువ్వేరా! ఎంకట్రావ్ !'

'నేను కాదండీ ! నేను కాదండీ !'

'నువ్వేరా ! నువ్వేరా !'

'తమరు ?! తవరు ?!'

'కొండబాబున్రా !'

'దయచేయండి ! కూర్చోండి !'

పిల్లలు పుస్తకాలు తీసుకుని ఇంట్లోకి వెళ్ళిపోయారు. కొండబాబుని కుర్చీలో కూర్చోబెట్టేడు. అతడు మంచం మీద కూర్చున్నాడు.

'మనం కలిసి చదువుకున్నాంరా! నా గురువుగారి పుత్రరత్నానివిరా నువ్వు ! నిన్ను నేను మర్చిపోలేదు ! నువు నన్ను మర్చిపోయావురా !'

'తమర్ని... తవర్ని... మిమ్మల్ని... మిమ్మల్ని... మర్చిపోలేదండీ! తొందరగా గుర్తుపట్టలేకపోయాను! అంతే అంతే! నన్ను క్షమించండి!'

'ఏరా!' అని పిలవాలి గానీ 'తమరు' అంటున్నావేట్రా!'

'తమర్ని .. తవర్ని ... మీరు ... పెద్దవారు ! ప్రజా నాయకులు ! ప్రజా ప్రతినిధులు ! 'ఏరా' అని ఎలా పిలవగల్ను !'

'వీధిబడి నడుపుతున్నా వేటి ?!'

'కాదండీ ! ఇంటిబడే ! చెట్టు కింద చల్లగా వుంటుందని పిల్లలు ఇక్కడే చదువుకుంటూ వుంటారు !'

'గురువుగారు పోయారు కదా ! నిన్ను పలకరిద్దావని వచ్చేను! పున్నేత్ముడు సొరగానికి ఎళతాడు గానీ, నరకానికి ఎల్లడు !'

'తమరి దయ ... అభిమానం - గురువుగారి పట్ల గౌరవం !' అని వెంకట్రావు కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

కొండబాబు కళ్ళజోడు తీసి చేత్తో పట్టుకున్నాడు. వెంకట్రావు మొహంలోకి చూస్తున్నాడు. అతడు వుంటున్న ఇల్లు చూస్తున్నాడు. అటూ-ఇటూ-చూస్తున్నాడు. తలపైకెత్తి చెట్టుని చూస్తున్నాడు.

'ఆ ఇల్లు కంటే ఈ చెట్టు-హాయిగా బావుంది కదూ !'

అవునన్నట్లు వెంకట్రావు తలవూపేడు.

కొండబాబు కళ్ళజోడు పెట్టుకుంటున్నప్పుడు చెయ్యి నుదుటికి తగిలింది. బొట్టు చెరిగిపోయింది. అతడు వెంటనే దిగ్గున లేచాడు. చీకాగ్గా, కోపంగా కారుదగ్గరికి వెళ్ళేడు. బ్రీఫ్‌కేస్ తీసేడు. అందులోంచి వెండి కుంకుమభరిణి తీసేడు. ఎదురుగా వున్న మంగలిషాపు వేపు నడిచేడు. మంగలిషాపులో దూరేడు. అద్దంముందు నిలబడ్డాడు. అద్దంలో మొహం చూసుకున్నాడు. కుంకుమ తీసి, కళ్ళకి అద్దుకున్నాడు. బొట్టు పెట్టుకున్నాడు. భరణిలోంచి రాగికాణీ తీసేడు. కాణీని బొట్టుమీద పెట్టి, కాణీలా బొట్టుని సరిదిద్దేడు. అద్దంలో మొహం మళ్ళీ మళ్ళీ చూసుకున్నాడు. నవ్వుకుంటూ వచ్చి, కుర్చీలో కూర్చున్నాడు.

వెంకట్రావు ఆశ్చర్యపోతూ, భయపడుతూ నిలబడ్డాడు.

కొండబాబు మౌనంగా రెండు నిమిషాలు కూర్చున్నాడు.

'ఇది ఇల్లు కాదు! కారు షెడ్ ! ఇందులో ఎలా వుంటున్నావ్ ?!'

'తక్కువ జీతం !'

'నాకో చిన్న ఇల్లు వుంది. మూడు గదులున్నాయ్. నీకు సరిపోతుంది. ఇప్పుడు ఖాళీగా వుంది.'

'అంత అద్దె ఇచ్చుకోలేను !'

'ఈ ఇంటికి ఎంత ఇస్తున్నావో, అంతే ఇయ్యి !'

'మీకు ఇబ్బంది కలిగించడం నాకు ఇష్టంలేదు !'

'నువ్ నా గురువుగారి కొడుకువి! నా మిత్రుడివి! ఆ మాత్రం సాయం చేయలేనా?!'

కొండబాబు వెంటనే వెంకట్రావుని ఆ ఇంటికి తీసుకెళ్ళేడు. కొండబాబంత పెద్దవారి పక్కన కార్లో కూర్చోడం వెంకట్రావుకి చాలా ఇబ్బందిగా వుంది. అంచేత వెంకట్రావు కాళ్ళూ, చేతులూ దగ్గర దగ్గరగా పెట్టుకుని, కుదించి కూర్చున్నాడు. వెనక సీటుకి నడుం ఆన్చకుండా, చేతులు కట్టుకుని ముందుకి వొంగి వినయంగా కూర్చున్నాడు.

కొండబాబు ఇల్లు చూపించేడు. తాళాలు ఇచ్చేసేడు.

'ఇది నీ ఇల్లే అనుకో !' అన్నాడు. మరేమీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

★ ★ ★

వెంకట్రావు ఆ ఇంట్లో దిగేడు.

విశాలంగా వున్న మూడుగదుల ఇంట్లో – సంతోషకరమైన తక్కువ అద్దెకు – సంతోషంతో భార్య అందిస్తున్న చల్లని నవ్వుల్లో – ఆనందంతో పిల్లలు అందిస్తున్న వెన్నెల నవ్వుల్లో – ఇంటి ముందున్న మందారం చెట్లు అందిస్తున్న చల్లని గాలిలో – వెంకట్రావు ఆనందంగా, సంతోషంగా, చల్లని పవనంలా చల్లచల్లగా జీవితాన్ని గడుపుతున్నాడు.

ఒక నెల గడిచింది.

కారు హార్నే గాకుండా పిలుపు కూడా విని, కొండబాబుగారొచ్చేరని అనుకొని, దయచేయండి, దయచేయండని పిలుస్తూ, లుంగీ పంచె బిగించుకుని గబగబ బయటకు వచ్చి, మంత్రిగారిని మండల ప్రెసిడెంటు ఆహ్వానించినట్లు వెంకట్రావు కొండబాబుని ఆహ్వానించేడు.

కుశల ప్రశ్నలతో చల్లని కబుర్లతో పదినిమిషాలు గడిపేరు.

'గురువుగారు రాసిచ్చిన కాగితాలు వాళ్ళకిచ్చేవా ?!'

'లేదు ! లేదు! పొరపాటు జరిగిపోయింది ! బద్ధకించేను ! క్షమించండి, క్షమించండి !'

'ఎందుకివ్వలేదు ?!'

'బద్దకించేను ! అంతే, అంతే ! క్షమించండి, క్షమించండి !'

'ఆ కాగితాలు ఇలా తీసుకురా !'

వెంకట్రావు కాగితాలు తీసుకొచ్చేడు. ఆ కాగితాల్లోని ప్రతి అక్షరం శ్రద్ధగా మరోసారి చదివేడు. తలదించుకుని, కళ్ళు పైకెత్తి, చెంపలు వాయించుకోనా అన్నట్లు కొండబాబు మొహంలోకి చూస్తున్నాడు.

'ఆ చెరువు నాకు అమ్మమని ఆ కాగితాల్లో వుందికదా ?!'

వెంకట్రావు భుజం తట్టి విరగబడి నవ్వుతూ కొండబాబు అడిగేడు.

వెంకట్రావు మౌనంగా వుండిపోయాడు.

నల్లని మబ్బుల్లో చీకటైపోయిన ఆకాశం ముక్కలా అతడి మొహం చీకటైపోయింది. ఆ కాగితాల్లోని ప్రతి అక్షరంలోనూ – మండుతున్న అగ్గి కొండలా – నారాయణ బాబు కనిపిస్తున్నాడు. అగ్గికొండ విసురుతున్న నిప్పుల్లో అతడి గుండె కాలిపోతున్నట్లు వెంకట్రావు చలించిపోతున్నాడు.

అయితే – ఆ సమయంలో కొండబాబు చల్లగా, చల్లని పవనంలా చిరునవ్వు నవ్వుతూ రెండు చల్లని మాటలు విసిరేడు.

'ఈ ఇల్లు నీ పేర రాస్తాను ! ఆ చెరువు నా పేర రాయవోయ్!'

'చెరువు నా చేతుల్లో పడితే చెరువు కింద బూవులన్నీ వాటంతటవే నా చేతుల్లో పడతాయరా, ఎంకట్రావ్!' అని అతడు వెంకట్రావుతో అనలేదు కానీ మనసులో మాత్రం అనుకున్నాడు.

విశాలమైన ఆ ఇంట్లో – భార్య చల్లని నవ్వుల్లో – పిల్లల వెన్నెల నవ్వుల్లో – మందారం చెట్ల చల్లని నీడల్లో – చల్లని పవనంలా చల్లగా గడుస్తున్న వెంకట్రావు జీవితం అతని చేత రెండు చల్లని మాటలు చెప్పించింది!

"చిత్తం ! చిత్తం !" అన్నాడు వెంకట్రావు.

కొండబాబు ఆ కాగితాలు తీసుకున్నాడు. ముక్కలు ముక్కలుగా చింపి, మంటపెట్టి, మసిచేసేడు.

ఆ సొంత ఇంట్లో వెంకట్రావు జీవితాన్ని సుఖంగా గడుపుతున్నాడు.

★ ★ ★

వెంకట్రావు జీవితాన్ని సుఖంగా గడుపుతున్నా, అతడి గుండెల్లో విషాదం గూడు కట్టుకుని కూర్చుంది.

"నా తండ్రి కోర్కెను మంటకలిపేను! నాకో ఇంటికోసం చిన్న రైతుల ఇళు కూలదోస్తున్నాను ! చెరువుని కొండబాబు చేతుల్లో పెట్టేసాను! నా తండ్రి తరంనాటి మంచిని, నాతరం డబ్బుగా మార్చుకుంటోంది!" అని పరితపిస్తూ, వెంకట్రావు కుంగిపోతున్నాడు. కూలిపోతున్నాడు.

చెరువుని చేజిక్కించుకున్నాక, కొండబాబు కొన్నాళ్లు చాలా సంతోషంగా వున్నాడు. చిన్నరైతులు చెరువులోని చిన్న చేపలేకదా - అని చిరునవ్వు నవ్వుకుంటూ కొన్నాళ్ళు గడిపేడు.

అయితే - కొండబాబు ఈ మధ్దిన విషాదంగా కనబడుతున్నాడు. అతడలా ఎందుకు విషాదంతో కుంగిపోతున్నాడో - వెంకట్రావు తెలుసుకోలేకపోతున్నాడు.

చిన్నరైతులు చెరువులోని చిన్నచేపలు కాజాలరని ప్రజాఉద్యమం చెవిలో వేసిన మాటలు కొండబాబుని కుంగదీస్తున్నాయనీ - అలాంటి సంఘటనలు ఎన్నో కళ్ళముందు బొమ్మల్లా కదులుతూ అతణ్ని కూలదోస్తున్నాయనీ - అంచాత అతడి మొహంలో విషాదపు ఛాయలు మృత్యువు నీడల్లా కనబడుతున్నాయనీ వెంకట్రావు తెలుసుకోలేకపోతున్నాడు!

★ ★ ★

(అరుణతార - మాసపత్రిక - ఏప్రిల్ 1996)